క్లుప్తంగా

డీఎస్పీగా ఎంపికైన రాహుల్‌కు సత్కారం



రాహుల్‌ను సన్మానిస్తున్న సీఐ చరమందరాజు

నేరేడుచర్ల : ఇటీవల విడుదలైన గ్రూప్‌-1 పరీక్ష ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన నేరేడుచర్లకు చెందిన దాసరి రాహుల్‌ను ఆదివారం హుజూర్‌నగర్‌ సీఐ చరమందరాజు, నేరేడుచర్ల ఎస్‌ఐ ఎ.రవీందర్‌నాయక్‌ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ చరమందరాజు మాట్లాడుతూ.. 22 ఏళ్ల వయసులోనే రాహుల్‌ డీఎస్పీగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. పోలీస్‌ శాఖలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ చింతమళ్ల సైదులు, శ్రీనివాస్‌, రాంబాబు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త కన్నెబోయిన వీరబాబు ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడటంతో రెండు కాళ్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ ఆదివారం వీరబాబును పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ నడిగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్‌, మాజీ కోఆప్షన్‌ సభ్యుడు ఎండీ.జలీల్‌, నాయకులు మేకల వీరబాబు, పుట్టపాక ఉదయ్‌, గుండు శ్రీనివాస్‌, ఎస్‌కే.మౌలానా, కన్నెబోయిన మురళీకృష్ణ, గంటెపంగు సైదులు, పోలంపల్లి వెంకటేశ్వర్లు, ఎంఎస్‌ఎఫ్‌ జిల్లా కన్వీనర్‌ పందిటి నవీన్‌ ఉన్నారు.

పాస్టర్స్‌ డే



కేక్‌ కట్‌ చేస్తున్న పాస్టర్‌ అబ్రహం

చిలుకూరు: మండలంలోని సీతారాంపురం గ్రామంలో గల కవనెంట్‌ చర్చిలో ఆదివారం ప్రపంచ పాస్టర్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిలివర్స్‌ చర్చి పాస్టర్‌ అబ్రహం కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో గాంధీ, వెంకటేశ్వర్లు, రాంబిన్‌, కిరణ్‌, అన్నమ్మ, బీబమ్మ, రత్నమ్మ, స్వరూప, రవనమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముస్లింల వన భోజనాలు

నడిగూడెం : మండల కేంద్రంలోని కలకోవ రహదారి వెంట ఉన్న ఓ మామిడి తోటలో స్థానిక ముస్లింలు వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత గ్రామంలోని ముస్లింలు వన భోజనాల సంప్రదాయాన్ని తిరిగి పునరుద్ధరించారు. అనేక కుటుంబాలు ఒకేచోట కలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న దామెర శ్రీనివాస్‌

మఠంపల్లి : రజకులు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని రజక ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ దామెర శ్రీనివాస్‌ అన్నారు. మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల రజక అన్నదాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన, పదోన్నతులు, ఉత్తమ అవార్డులు సాధించిన రజక ఉద్యోగులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దామెర శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ఉద్యోగాలు సాధించిన వారు ఉద్యోగ బాధ్యతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్‌ మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌, సత్రం కమిటీ అధ్యక్షుడు పిల్లుట్ల కృష్ణయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌, నాయకులు పిల్లుట్ల శ్రీనివాస్‌, సట్టు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కోటయ్య, వర్మ, లింగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ తప్పనిసరి

సూర్యాపేట అర్బన్‌ : ప్రస్తుత సమాజంలో విద్యార్థిని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే కరాటే శిక్షణ ఎంతో అవసరమని సీనియర్‌ కరాటే మాస్టర్‌ జేవీ రమణ(చిన్న) అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సుమన్‌ షాటోఖాన్‌ స్పోర్ట్స్‌ కరాటే డూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక మినీ ట్యాంక్‌ బండ్‌పై బెల్టులు ప్రదానం చేసి మాట్లాడారు. కరాటే శిక్షణ ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వానికి తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతల దారులు.. రాకపోకలకు ఇబ్బందులు



పాలకవీడు సమీపంలో గుంతలమయంగా మారిన పొలాల బాట

- పాలకవీడు మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానం
- రైతులకు తప్పని తిప్పలు

పాలకవీడు : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే రోడ్లు అడుగడుగునా గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, ఇతర మోటార్‌ వాహనాలు పొలాలకు వెళ్లాలంటే కష్టతరంగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు పొలాలకు తీసుకెళ్లాలన్నా, పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్నా పడరానిపాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షాలు పడినప్పుడు ఈ దారుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని, బురదమయమై నడవడానికి కూడా వీలు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వరి కోతల సమయంలో ధాన్యం తరలించేందుకు వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో కూలీలతో కొంత దూరం మోయించాల్సి వస్తోందని, దీనికి అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. మండలంలోని పాలకవీడు, జాన్‌పహాడ్‌, బెట్టెతండా, సజ్జాపురం, గుడుగుంట్లపాలెంతో పాటు అనేక గ్రామాల్లో రైతులు తిప్పలు పడుతున్నారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నెస్పీ కాల్వ కట్టల మీదుగా కూడా రైతులు పొలాలకు వెళ్తుంటారు. అవి కూడా అధ్వానంగా మారాయి. కాల్వ కట్టలు, పొలాలకు వెళ్లే రోడ్లను బాగు చేసి వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులను రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తక్షణమే మరమ్మతులు చేయాలి

పొలాలకు వెళ్లే రోడ్లు అడుగడుగునా గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. పనులకు వెళ్లాలంటే కష్టంగా మారింది. నాట్లు వేయాలన్నా, కోతలు కోయాలన్నా, పశుగ్రాసం తరలించాలన్నా ట్రాక్టర్లు, యంత్రాలు వెళ్లలేని పరిస్థితి. రైతులు పడుతున్న అవస్థలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– మునగాల రాజీవ్‌రెడ్డి, రైతు, గుడుగుంట్లపాలెం

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌

పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు దృష్టి సారించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, మెటల్‌ రోడ్లు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌ చేస్తున్నారు. అక్కడక్కడా రోడ్లు ఆక్రమణలకు గురై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందని, వాటిని సరిజేయాలని కోరుతున్నారు. మరికొన్ని రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయని, ధాన్యం తరలింపు కష్టంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌.కృష్ణయ్యపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న రామకృష్ణ యాదవ్‌

మునగాల : బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్యను విమర్శించే స్థాయి సీపీఎం నాయకులకు లేదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్‌ అన్నారు. మునగాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి చెందిన సీపీఎం నాయకులు పదవుల కోసమే ఆర్‌.కృష్ణయ్య బీసీ వాదం ఎత్తుకున్నారని ఆరోపణలు చేస్తున్నారని, వారి వ్యాఖ్యలు సరికాదన్నారు. గత 40 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాల కోసం కృష్ణయ్య పోరాడుతున్నారని, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌, గురుకులాలు, బీసీ వసతి గృహాల కోసం ఎంతో ఉద్యమించారని, అదే విధంగా నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం పోరాటాలు చేసిన ఘనత కృష్ణయ్యదేనని పేర్కొన్నారు. కృష్ణయ్య ఏనాడు పదవుల కోసం పోరాడలేదని, ఆయన పోరాట పటిమను గుర్తించి 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్‌ పార్టీలు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాయని, అదేవిధంగా వైఎస్సార్‌సీపీ, బీజేపీలు రాజ్యసభ సభ్యుడిని చేశాయని గుర్తు చేశారు. కృష్ణయ్యను విమర్శించే ముందు సీపీఎం నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. పెత్తందారుల కోసం పాకులాడే సీపీఎం నాయకులు ఇకపై ఇలాంటి విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు బత్తుల రాంబాబు, బడేటి సత్యం, నాగరాజు, నారగాని నరేష్‌, సతీష్‌, వీరబాబు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి

ఆర్‌.కృష్ణయ్యను విమర్శించే సీపీఎం నాయకులు ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని బీసీ యువజన సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణ యాదవ్‌ అన్నారు. మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ముసుగులో బీసీ నాయకులపై విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి

చిలుకూరు : స్థానిక సంస్థల్లోనే కాకుండా బీసీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బహుజన వేదిక రాష్ట్ర కన్వీనర్‌ కస్తూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. చిలుకూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకే కాకుండా బీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీల రిజర్వేషన్లకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్‌ : ప్రజా సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆమెకు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు నాయకులు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్‌ : మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. హుజూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) జిల్లా మూడో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తానని ఇచ్చిన హామీని విస్మరించిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా మున్సిపల్‌ కార్మికుల గురించి మాట్లాడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పారిశుద్ధ్య విభాగంలో తెలంగాణను మొదటి స్థానంలోకి తీసుకొచ్చిన ఘనత మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్మికులకే దక్కుతుందని పేర్కొన్నారు. రాత్రిపగలు తేడా లేకుండా కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్‌ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అక్టోబర్‌ 14, 15 తేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కంచెలులో జరిగే రాష్ట్ర మహాసభలకు మున్సిపల్‌ కార్మిక వర్గం తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎం.దుర్గారావు, నాగేశ్వరరావు, ఎల్లమ్మ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు సైదులు, ముత్యాలు, నర్సింహ, కుమారి, బ్రహ్మం, నాగమణి, దేవకరణ, సంతోష్‌, శ్రీను, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్‌ : సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

హుజూర్‌నగర్‌ : బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు ములకలపల్లి రాంబాబు, సీఐటీయూ నాయకుడు యల్క సోమయ్య కోరారు. హుజూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ సంఘం, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో దశాబ్దాలుగా బీసీలు సామాజికంగా, రాజకీయంగా, విద్యా, ఉపాధి పరంగా అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని నిర్మించి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌ సాధించి తీరుతామని పేర్కొన్నారు. రిజర్వేషన్‌ అనేది బీసీల హక్కు అని, ఆ హక్కును సాధించేందుకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 18న జరిగే బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రావినూతల ఇందిర, వి.మధుగౌడ్‌, ఎం.నాగమణి, కె.కృష్ణ, వి.శ్రీనివాస్‌, ఎస్‌.శ్రీనివాస్‌, జి.శివ, బి.నాగేశ్వరరావు, కె.బ్రహ్మాచారి, శేఖర్‌, వెంకటేశ్వర్లు, కాశీరాం, బాబు, అంజి, రవి, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించాలి

మేళ్లచెరువు : తెలంగాణ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు స్టేను నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవ్య, అంకమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ప్రకటించాలి

హుజూర్‌నగర్‌ : తెలంగాణ బంద్‌కు మేధావి వర్గం, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. హుజూర్‌నగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ నాటకంగా మార్చేశాయని ఆరోపించారు. ఆయన వెంట రామయ్య, వెంకన్న, కోటమ్మ, వరలక్ష్మి, అజార్‌ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేట : పట్టణంలోని ఠాగూర్‌ విద్యానికేతన్‌కు చెందిన 1996 –97 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమణ, పద్మరేఖ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర



హుజూర్‌నగర్‌ : సమావేశంలో పాల్గొన్న లంబాడీ హక్కుల ఐక్య వేదిక జేఏసీ సభ్యులు

హుజూర్‌నగర్‌ : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని లంబాడీ హక్కుల ఐక్య వేదిక జేఏసీ సభ్యులు ఆరోపించారు. హుజూర్‌నగర్‌ టౌన్‌ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల తుడందెబ్బ నాయకులు లంబాడీ కమ్యూనిటీ గురించి అసభ్యంగా మాట్లాడటం, లంబాడీ జనాభాను ఎస్టీ నుంచి తొలగించాలనడం బాధాకమన్నారు. లంబాడీ కమ్యూనిటీ మీద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, మరోసారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికై నా వారి మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్‌ రాథోడ్‌, బాలాజీ, వెంకట్రాం, వెంకటేశ్వర్లు, భజన్‌, చంద్రమౌళి, నాగేశ్వరరావు, రామ్‌లాల్‌ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టార్జీని సన్మానిస్తున్న కళామండలి సభ్యులు

కోదాడ రూరల్‌ : హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న విశ్వజన కళామండలి 50వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సినీ గేయ రచయిత, విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టార్జీ అన్నారు. కోదాడలో ఆదివారం నిర్వహించిన విశ్వజన కళామండలి, మూల వాసుల సంఘం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్షికోత్సవానికి మానవతావాదులు, కళా కారులు, కళా అభిమానులు, కళా పోషకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం కళామండలి సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్‌, గంధం పాండు, ఇస్మాయిల్‌, మాతంగి శైలజ, సురేష్‌, సైదులు, తిరుప్‌, ప్రసాద్‌, లీలా, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం



ప్రాథమిక పాఠశాల ప్రహరీకి రంగులు వేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

నడిగూడెం : మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండాలో నడిగూడెం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం కొనసాగుతోంది. ఆదివారం ఎక్లాస్‌ఖాన్‌పేట తండా ప్రాథమిక పాఠశాల ప్రహరీకి గ్రామానికి చెందిన బానోతు సైదా నాయక్‌ సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు రంగులు వేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌ షేక్‌ జానిపాష, కర్నాటి శ్రీధర్‌, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



నడిగూడెం నుంచి ఖమ్మం జిల్లా సరిహద్దు వరకు పూర్తయిన బీటీ రోడ్డు

- నిధుల మంజూరుతో పూర్తయిన నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నడిగూడెం : మండలంలో పలు గ్రామాల రోడ్లకు మహర్దశ కలిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి కృషితో దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్ల నిర్మాణాలకు మోక్షం లభించింది. నడిగూడెం మండల కేంద్రం నుంచి నారాయణపురం క్రాస్‌రోడ్డు, కరివిరాల క్రాస్‌రోడ్డు, కాగితరామచంద్రాపురం మీదుగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడినర్సయ్యగూడెం డబుల్‌ రోడ్డు వరకు, సిరిపురం–చాకిరాల, సిరిపురం–రత్నవరం రోడ్లు పూర్తి కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.20 కోట్లతో డబుల్‌ రోడ్డు నిర్మాణం పూర్తి

నడిగూడెం నుంచి ఖమ్మం పట్టణానికి వెళ్లాలంటే దూరం తక్కువే. కానీ ఇరుకైన రహదారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకొని కొందరు గాయాలపాలు కాగా, మరికొందరు మృత్యువాత పడ్డారు. అయితే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నడిగూడెం నుంచి బృందావనపురం, నారాయణపురం, కరివిరాల క్రాస్‌రోడ్డు, కాగితరామచంద్రాపురం గ్రామం మీదుగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడి నర్సయ్యగూడెం వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కాగితరామచంద్రాపురం గ్రామంలో తప్ప మిగతా రహదారి పనులు పూర్తయ్యాయి. దీంతో మునగాల, నడిగూడెం మండలాలకు చెందిన ప్రజలు ఖమ్మం వెళ్లడానికి మార్గం సులువైంది.

మూడున్నర కిలోమీటర్ల మేర..

మండలంలోని సిరిపురం నుంచి చాకిరాల వరకు రెండున్నర కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.30 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా సిరిపురం నుంచి రత్నవరం ఒక కిలోమీటర్‌ మేర రోడ్డుకు రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు కూడా పూర్తయ్యాయి. గతంలో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేదని, ఇప్పుడు ప్రయాణం సులువైందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఉత్తమ్‌, ఎమ్మెల్యే పద్మావతి కృషితోనే..



మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కృషితోనే సిరిపురం–చాకిరాల, సిరిపురం–రత్నవరం రోడ్ల పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

– శెట్టి సతీష్‌, సిరిపురం

ఇబ్బందులు తొలిగాయి..



నడిగూడెం నుంచి ఖమ్మం వెళ్లాలంటే ఇరుకైన రహదారి ఉండేది. ప్రభుత్వం రూ.20 కోట్లతో పనులు ప్రారంభించగా సూర్యాపేట జిల్లా సరిహద్దు వరకు పూర్తి చేశారు. డబుల్‌ రోడ్డు పూర్తి చేయడంతో ఇబ్బందులు తొలిగాయి.

– ఎలకా వెంకటరెడ్డి, నడిగూడెం

భూగర్భ జలం.. పెంపే లక్ష్యం

- ఉపాధి హామీ పథకంలో కొత్తగా బోర్‌వెల్‌ రీఛార్జ్‌, ఇంకుడు గుంతల నిర్మాణాలు



చిలుకూరు మండల పరిషత్‌ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ రీఛార్జ్‌



చిలుకూరులో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఇంకుడు గుంత

చిలుకూరు : భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా, ఎండిపోయిన బోర్‌వెల్స్‌ను పునరుద్ధరించడం కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్తగా బోర్‌వెల్‌ రీఛార్జ్‌లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతోంది. అదేవిధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలనుకునే వారిని ప్రోత్సహిస్తోంది. ఈ బోర్‌వెల్‌ రీఛార్జ్‌లను మండలాల్లోని వివిధ గ్రామాల ప్రధాన ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఇప్పటికే మండలంలో రెండు బోర్‌వెల్‌ రీఛార్జ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి మండల పరిషత్‌ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయగా, మరొకటి పాత చిలుకూరులోని గోదాముల వద్ద ఏర్పాటు చేశారు. బోర్‌వెల్‌ రీఛార్జ్‌ నిర్మాణం కోసం ఉపాధి కూలీల ఖర్చు కింద రూ.2,755, సామగ్రికి రూ.28, 610 కేటాయించారు. అలాగే కమ్యూనిటీ ఇంకుడు గుంతలు మండల వ్యాప్తంగా మూడు ఏర్పాటు చేశారు. చిలుకూరు రామాలయం, చిలుకూరు జెడ్పీ పాఠశాల, చిలుకూరు గ్రామ నర్సరీ వద్ద నిర్మాణం చేపట్టారు. ఒక్కో దానిని రూ.12,500తో ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా 50 ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టగా రూ.6 వేలు చొప్పున మంజురు చేశారు.

అనేక ప్రయోజనాలు..

బోర్‌వెల్‌ రీఛార్జ్‌, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలతో నీటి ఎద్దడిని తగ్గించడం, నీటి కొరతను అధిగమించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా ఈ నిర్మాణాలు వర్షపు నీటిని ఫిల్టర్‌ చేసి బోర్‌వెల్‌లోకి నేరుగా పంపడం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచుతాయి. ఎండిపోయిన లేదా నీటి సరఫరా తక్కువగా ఉన్న బోర్‌వెల్‌లను తిరిగి ఉపయోగించుకోవడానికి కూడా సహాయ పడతాయి. వర్షపు నీటిని సహజ వనరుల్లో నిల్వ చేయడం ద్వారా భవిష్యత్‌ తరాల కోసం నీటి వనరులను సంరక్షిస్తాయి. ఫిల్టరింగ్‌ వ్యవస్థ బురద, మట్టి వంటివి బోర్‌వెల్‌లోకి చేరకుండా నిరోధిస్తుంది.

భూగర్భ జలాలు పెరుగుతాయి



బోర్‌వెల్‌ రీఛార్జ్‌లు, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయి. మండల కేంద్రం చిలుకూరులో 3 కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, 2 బోర్‌వెల్‌ రీఛార్జ్‌లు ఏర్పాటు చేశాం. అదేవిధంగా మండలంలో 50 వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం.

– చేవ ప్రసాద్‌, ఉపాధి హామీ ఈసీ, చిలుకూరు మండలం